క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా 200 ప్లేట్లను మండల విశ్వ హిందూ పరిషత్తు నిర్వాహకులు సోమవారం పంపిణీ చేశారు. శెట్టి హనుమంతరావు, భవిరిశెట్టి రామారావు, గుండా ఉమామహేశ్వరరావు, కజ్జం ఆంజనేయులు, గణితి అమరయ్య, ముచ్చర్ల రామారావు, కరాలపాటి ఆదినారాయణ, చిట్టిప్రోలు నరసింహారావు తదితరులు ప్లేట్లు బహూకరించారు. ఎంఈఓ టి.రవికుమార్, హెచ్‌ఎం విజయలలిత పాల్గొన్నారు.

ఎంఈఓ-1గా అదనపు బాధ్యతలు



దాచేపల్లి : మండల విద్యాశాఖ అధికారి-1గా కె.కాంతారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయపురి సౌత్ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కాంతారావుకి ఎంఈవో-1(అదనపు బాధ్యతలు)లను ప్రభుత్వం అప్పగించింది. సోమవారం ఎంఈఓ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటించేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ-2 పినాకపాణి కాంతారావును సన్మానించారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



మాచర్ల: భక్తులు ఆధ్యాత్మిక చింతనతో మంచి సమాజంలో అందరూ సంతోషంగా ఉండాలని పూజా కార్యక్రమాలు చేయాలని కాశీవిశ్వనాథ స్వామి అన్నారు. బ్రహ్మశ్రీ సద్గురు ముసలయార్య దేశిక స్వామి 135 జయంతి సందర్భంగా 6వ రోజు 75వ అమృత వర్షోత్సవ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామంలో జ్ఞానాశ్రమంలో నిర్వహించిన ఆరాధనలో కాశీవిశ్వనాథ స్వామి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సద్గురు ముసలయార్య దేశిక స్వామి వెలసి, దేవుని ఆశీస్సులతో ప్రజలకు ఎన్నో మంచి సందేశాలను అందించారన్నారు. ఆయన స్ఫూర్తితో జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయడం అదృష్టమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు జరిపారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించి, అన్నదానం చేశారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి ఈ ఆరాధనలో పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



కారెంపూడి: మండల ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా సముద్రాల సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీ వాసవి అమ్మవారి దేవాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కాసుల శంకర్, ట్రెజరర్‌గా కొమ్మూరి శ్రీనివాసరావును ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. చీతిరాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

దాచేపల్లి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్.వి.రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీపీ కందుల జాన్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

పొలం దారి సమస్య పరిష్కారానికి వినతి

దాచేపల్లి: మండలంలోని రామాపురానికి చెందిన రైతులు తహసీల్దారు గీతా వాణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 133-2లో 4.48 ఎకరాల గంగమ్మ గుడి మాన్యం ఉందని, ఈ భూమి చుట్టూ.. తూర్పున పోతుల పకీరయ్య, పోతుల వినోద్, వేముల గురవారెడ్డి, ఉత్తరాన బండి రామకృష్ణారెడ్డి మట్టితో గట్టుపోసి వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకుండా ఇబ్బంది పెడుతున్నారని రైతులు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ దారి మీదుగా అరకలు, వర్షపు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులు వి. శ్రీనివాసరావు, చిల్లా కోటేశ్వరరావు, వీర్ల శేషయ్య, వీర్ల సైదులు, ఎం.అంకయ్య, వీర్ల పాపయ్య, సీహెచ్. పున్నయ్య, చల్లా గంగయ్య కోరారు. సర్వే చేయించి, సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దారు గీతావాణి రైతులకు హామీ ఇచ్చారు.

ఆర్డర్ కాదు.. రిక్వెస్ట్..!



హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, న్యాయవాదులు

- శిరస్త్రాణంపై ద్విచక్ర వాహనదారుల్లో అవగాహన
- నడుంకట్టిన న్యాయమూర్తులు
- పోలీస్ వ్యవస్థతో కలిసి ర్యాలీలు

గురజాల : రోజూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంటోంది. ఈ ప్రమాదాల్లో అధికంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోవడం లేదా క్షతగాత్రులు కావడం జరుగుతోంది. హెల్మెట్ ధరించకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా గణాంకాలు చెబుతున్నాయి. శిరస్త్రాణంపై పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించినా, అవగాహన కార్యక్రమాలు చేపట్టినా..చాలా మంది ప్రయాణికుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. అపరాధ రుసుం విధిస్తున్నా.. అది అప్పటి వరకే.. అనంతరం మర్చిపోతున్నారు. దీంతో ఇప్పటి వరకు పోలీస్ యంత్రాగానికి పలు ఆదేశాలిచ్చిన న్యాయమూర్తులే రంగంలోకి దిగుతున్నారు. రోడ్డు మీదకు వెళ్లి హెల్మెట్ ధరించండి... ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు, బైక్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. కోర్టుల్లో ఆర్డర్లు వేసి, కేసులు పరిష్కరించే న్యాయమూర్తులు రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించేందుకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని రిక్వెస్ట్ చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు ఈ నెల 18న హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

హెల్మెట్ వాడితే ప్రాణాలకు భరోసా



ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరిస్తే.. ప్రమాదం జరిగినా ప్రాణాలకు ముప్పు ఉండదు. హెల్మెట్ వాడకంతో తలకు గాయం కాకుండా ఉంటుంది. ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను, కారు నడిపే వారు సీటు బెల్టును విధిగా ధరించాలి. వారిపై ఆధారపడి జీవించే వారికి ఒక భరోసానివ్వాలి.

– బాలకృష్ణ, సీఐ, గురజాల

ఎల్‌ఆర్‌జీ-133 కంది వంగడంతో అధిక దిగుబడి

రైతులకు లాం ఫాం శాస్త్రవేత్తల అవగాహన



రైతులకు కంది విత్తన కిట్స్ పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

కారెంపూడి: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రూపొందిన ఎల్‌ఆర్‌జీ -133-33 రకం నూతన కంది వంగడం ప్రథమ శ్రేణి ప్రదర్శన మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రైతుల సమావేశంలో నూతన వంగడం గుణగణాలను, అనుకూలతలను జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు ఎం.శివకుమారి, లాం ఫాం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.రాజమణి, డాక్టర్ ఎన్.సాంబశివరావు, డాక్టర్ ఎల్.రాజేష్ చౌదరి వివరించారు. కంది పంట శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ నూతన కంది వంగడం ఎకరాకు నికరంగా 8 క్వింటాళ్ల పైనే దిగుబడినిస్తుందని, విత్తన దూరం అడుగు ఉండేలా చూసుకోవాలని వివరించారు. విత్తన మోతాదు, కలుపు నివారణ, పూత దశలో సస్యరక్షణ ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కొందరు రైతులకు నూతన వంగడం మినీ కిట్స్‌తో పాటు పెండి మిథాలిన్ కలుపు నివారణ మందు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. సస్యరక్షణ సమయంలో శాస్త్రవేత్తలు రైతులు వేసిన పంటలను పరిశీలించి, తగిన పురుగు నివారణ మందులను సూచిస్తారని శాస్త్రవేత్త సాంబశివరావు పేర్కొన్నారు. వాటిని రైతులకు ఉచితంగా అందిస్తారని వెల్లడించారు. అనంతరం మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలో పత్తి పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. అధిక వర్షాల నుంచి పైరు రక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఏప్రిల్‌లో వేసిన పత్తి పంటకు మాంకోజెబ్, కార్బన్‌డిజమ్ మందు పిచికారి చేయాలని, పంటకు యూరియా, పొటాష్ ఎరువులను అందించాలని పత్తి శాస్త్రవేత్త డాక్టర్ రాజమణి, డాక్టర్ రాజేష్ చౌదరి సూచించారు. ఏఓ బి.యలమందారెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు



అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దారు మంజునాథరెడ్డి

మాచర్ల రూరల్: పట్టణంలోని ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న మొక్కలు, పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించి, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కొమెర వసంతరావు గ్రీవెన్స్ సెల్‌లో వినతి పత్రం అందజేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మూడు అర్జీలు అందినట్లు తహసీల్దారు మంజునాథరెడ్డి తెలిపారు. తమ పూర్వీకులకు చెందిన భూమికి హద్దులు చూపించాలని వెంకటేశ్వర్లు, శ్రీశైలం రహదారి నుంచి పట్టణం వరకు రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని వెంకటపతిరాజు వినతిపత్రం అందించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సరోజనీదేవి, డాక్టర్ శివలీల, ఎఈ బాబులాల్ నాయక్, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, అంగన్‌వాడీ, విద్యుత్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్

మాచర్ల: సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసి ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా అన్ని విభాగాల ఉద్యోగులను చైతన్య పర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్ దాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో కమాండ్ కంట్రో రూమ్ ఉంటుందని, ప్రజలు ఫోన్ చేసి సమస్యలు చెబితే.. వెంటనే పరిష్కరించేందుకు తమ బృందం ఆయా సచివాలయాలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే మంగళవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల వద్ద ఆధార్ అనుసంధాన నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధార్ కేంద్రాలు పని చేస్తాయని పేర్కొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం



మాచర్ల : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల టాపర్‌గా నిలిచిన షేక్ సహీనాకు గోర్తి ఈశ్వర్ ట్రస్టు వ్యవస్థాపకులు ఉషాబాల, పవన్‌కుమార్ రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ట్రస్టు తరపున 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా బహుమతి ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ 2 అల్లి సురేష్, విశ్రాంత ఉపాధ్యాయుడు గాలీబ్ సాహెబ్, రోటరీ క్లబ్ సభ్యులు పటాన్ నాగూర్‌వలి, శ్రీనాథ్ రెడ్డి, జయేంద్రరెడ్డి, హెచ్‌ఎం షేక్ సకీనా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెష్‌లు, ఫ్యాన్లు అందజేత



గురుకుల పాఠశాలకు మెష్‌లు, ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

తాడికొండ: దాతల సాయంతో తాడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బీసీ బాలికల వసతి గృహంలో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 16న తాడికొండలో పర్యటించిన జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వసతి గృహాలను పరిశీలించి, చిన్నారులను దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో స్పందించిన తహసీల్దారు పిన్నక మధుసూదనరావు దాతలను సంప్రదించారు. దగ్గుమల్లి కమలాకర్ రూ.50 వేలు, నల్లపనేని లీలా శంకర్, నల్లగర్ల ప్రసాద్, యేనుగంటి నాగలక్ష్మయ్య తదితరులు మొత్తం లక్ష విలువ చేసే ఫ్యాన్లు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. సోమవారం తహపసీల్దారు మధుసూదనరావు చేతుల మీదుగా దాతలు పాఠశాల ప్రిన్సిపల్‌కు వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కాకుమాను ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ నెమలికంటి మరియదాసు, వైస్ ప్రిన్సిపల్ శేఖర్, వీఆర్‌వో శర్మ, స్థానిక నాయకులు బండ్ల కోటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలి

సత్తెనపల్లిలో న్యాయవాదులు విధుల బహిష్కరణ



పట్టణంలోని కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాటిబండ్ల రవి, న్యాయవాదులు డి.శ్రీనివాసరావు, జె.విజయ్‌కుమార్, బి.ఆదినారాయణ, సయ్యద్ అబ్దుల్ రహీమ్, కళ్ళం వీరభాస్కర్ రెడ్డి, రాజవరపు నరసింహారావు, బీఎల్ కోటేశ్వరరావు, జూపల్లి శేషయ్య, చవల బాల కోటయ్య, బయ్యారపు నరసింహారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వడియాల పాపారావు, గుజ్జర్లపూడి సురేష్, రాజా విజయ్ భరత్, కృష్ణారెడ్డి, ఫాజునుల్ల, తవ్వా హరినాథ్, పిల్లి సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు



బోధన సామగ్రి ప్రదర్శనలో ఎంఈవో శ్రీనివాహరావు, హెచ్‌ఎం పద్మావతి

సత్తెనపల్లి: విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2020లో జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టిందని మండల విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు అన్నారు. ఈ నూతన విధానాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు వారం రోజులపాటు అన్ని పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ (విద్యావారం) పేరుతో రోజుకో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా పట్టణంలోని వెంకటపతి నగర్‌లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్థానికంగా లభించే వనరులతో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన అభ్యాసన సామగ్రి ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్ష సప్తాహ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తంగెళ్లపల్లి పద్మావతి, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

పత్తిలో పచ్చదోమ నివారణకు చర్యలు చేపట్టాలి

రాజుపాలెం: పత్తి పంటలో పచ్చదోమ ఎక్కువగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని బలిజేపల్లిలో పత్తి పొలాలను రైతులతో కలసి సోమవారం ఆయన సందర్శించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ పత్తి పైరులో పచ్చదోమ ఎక్కువగా ఉందని, ఇది ఆకు అడుగుభాగంలో చేరి రసం పీల్చడం వలన ఆకులు ముడుచుకుపోయి దిగుబడి భారీగా తగ్గిపోతుందని తెలిపారు. దీని నివారణకు ఎస్‌ఫేట్ 350 గ్రాములు లేదా, ఎసిటమీప్రిడ్ లేదా థైవోమిత్తక్సమ్ 40 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి 10 రోజులకు మందులను మార్చుతూ పిచికారీ చేయాలని చెప్పారు. గత వారం రోజుల నుంచి కురుస్తున్న అధిక వర్షాలకు పత్తి పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలని, పొలంలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు పత్తి మొక్కలో వేరు కుళ్లు, ఎండు తెగులుకు గురవుతూ ఉంటాయి. అందుకు గాను కాపర్ ఆక్సీ క్లోరైడ్ 600 గ్రాములు, 20 గ్రాముల ప్లాంటోమైసిన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పిచికారీ చేయాలని తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులకు 40 రోజులకు పైబడిన ఆకులో అక్కడక్కడ ఎర్రగా మారతాయి. దీని నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ ఎకరాకు 2 కిలోల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు తిరుముల, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత

క్రోసూరు: పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సిరిచందన పేర్కొన్నారు. సోమవారం పారుపల్లి గ్రామంలో జరుగుతున్న యాంటీ లార్వల్ ఆపరేషన్ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి

మాచర్ల: పట్టణంలోని కృష్ణ వేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం జాతీయ జెండా ఆవిష్కరణ వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య చిత్ర పటానికి ప్రిన్సిపల్ హనుమంతరావు, ఏఓ శ్రీధర్ గుప్త, వైద్యులు సదాశివ రాజ్, ఎం.రామకృష్ణ, హరీష్‌చంద్ర నివాళులర్పించారు. ఇన్‌చార్జిలు గౌరి, నాగజ్యోతి, బాజి, శ్రీలక్ష్మీరెడ్డి, అంజినాయక్ పాల్గొన్నారు.

శ్రీవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు



పెదకూరపాడు(బెల్లంకొండ): మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో గల పర్వతంపై వెలసిన వేంకటేశ్వర స్వామి వారికి సోమవారం ఏడు అభిషేకాలతో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గోపాల్ నాయక్ మాట్లాడుతూ వచ్చే శ్రావణ మాసం శ్రవణ నక్షత్రం నాడు పంచామృతాలతో అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

రైతు ఇంట్లో చోరీ

సత్తెనపల్లి: రైతు ఇంట్లో చోరీ జరిగిన ఘటన సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుడిపూడి గ్రామానికి చెందిన రైతు తూమాటి రోశయ్య కుటుంబ సభ్యులతో ఈ నెల 19న ఇంటికి తాళం వేసి కాకినాడలో నివసిస్తున్న కుమార్తె వద్దకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం గుడిపూడి తిరిగిరాగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంటి లోపల పరిశీలించగా నాలుగు సవర్ల బంగారు ఆభరణాలు, కొన్ని వెండి వస్తువులు, రూ.5 వేలు నగదు, 5 పట్టు చీరలు అపహరించుకు పోయినట్లు గుర్తించారు. దీనిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శశికుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌కు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీమ్ చోరీ జరిగిన ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు బాధ్యులుగా ఉండాలి

- పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు
- తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుకు పౌర సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

పెదకూరపాడు: ఉద్యోగ విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి ప్రజలకు బాధ్యులుగా పనిచేస్తే వారు గుండెల్లో పెట్టుకుంటారని అందుకు ఉదాహరణ పెదకూరపాడు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అని పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములు అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై పెదకూరపాడు వచ్చిన తహసీల్దార్ ప్రభాకరరావు బదిలీపై తిరిగి మాతృ జిల్లా వెళ్తున్న సందర్భంగా సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు, గ్రామస్తులు పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల శ్రీరాములు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా బదిలీ సహజమని కానీ పని చేసే ప్రాంతంలో ప్రజలకు సేవలు అందించిన ఉద్యోగులు చిరస్థాయిగా ప్రజల మనసులో ఉంటారన్నారు. ఎన్నికల సమయంలో అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఎంపీడీవో మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రభాకరరావు ఎక్కడ పని చేసినా అక్కడ ప్రజల మనసులో ఉంటారన్నారు. డీటీ నిర్మలకృష్ణ, వీఆర్వోలు నరసింహారావు, జాన్‌సైదా, ప్రసాద్, శిలువరావు, నాయుడమ్మ, బుజ్జి, మరియదాసు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్గో పార్సిల్ రూమ్ ప్రారంభం

పిడుగురాళ్ల: ప్రజలకు మెరుగైన సేవలను అందించటమే ఏపీఎస్ ఆర్టీసీ లక్ష్యమని డీపీటీఓ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో నందు ఏర్పాటు చేసిన కార్గో పార్సిల్ రూమ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆర్టీసీలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పార్శిల్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల ప్రయాణికుల లగేజీ ఎలాంటి ఇబ్బంది లేకుండా గమ్య స్థానాలకు చేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం ఐ.సురేష్ కుమార్, డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు, కార్గో పార్శిల్ కాంట్రాక్టర్ శ్రీధర్, ఎస్‌టీఐ ఈవీఎంఎం రావు, జె.ప్రసన్న, జి.నరసింహారావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చింతపల్లిలో జల్ జీవన్ మిషన్ పనులు..

కారెంపూడి: మండలంలోని చింతపల్లి, చినగార్లపాడు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ శాఖల ఆధ్వర్యంలో అధికారులు సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. త్వరలో చింతపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు పనులు ప్రారంభమవుతాయని ఈఓఆర్డీ పి.సత్యప్రసాద్ తెలిపారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఏర్పాటు చేసుకునేలా చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, అందరూ కూడా ఆ దిశగా ఆలోచన చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్పంచ్ ఉన్నం రామాంజమ్మ, గ్రామ పెద్దలు మల్లికార్జునరావు, కార్యదర్శి రామరాజు, స్వచ్ఛ భారత్ ఎంసీఓ కె.సుబ్బారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామాంజి నాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ అప్‌డేట్

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల, గాదెవారిపల్లె గ్రామాల్లో మంగళవారం నుంచి 27వ తేదీ వరకు ఆధార్ అప్ డేట్ సెంటర్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో తప్పొప్పుల సవరణ, నమోదుకు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ పి.సత్య ప్రసాద్ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి.. ఏడుగురి అరెస్టు

పెదకూరపాడు: మండలంలోని కంభంపాడు గ్రామంలో పేకాట స్థావరంపై పెదకూరపాడు పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ విప్పర్ల వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంభంపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచరంతో దాడులు నిర్వహించగా పేకాట ఆడుతున్న తాటికొండ మండలం పెద్ద పరిమి గ్రామానికి చెందిన షేక్ ఖాశీం షరీఫ్, సరిపూడి నాగార్జున, పాములపాడు గ్రామానికి చెందిన చెకూరి సాంబయ్య, తుళ్ళూరు మండలం మందడం గ్రామానికి చెందిన షేక్ నాగూల్‌మీరా, అనంతవరం గ్రామానికి చెందిన నాగరాజు, అమరావతి మండలం అమరావతి గ్రామానికి చెందిన లక్ష్మీనారయణ, నరుకుళ్లపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావులును అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.81,525 నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

NOTICE

IN THE COURT OF THE X ADDL. DIST. JUDGE, GURAZALA, ANDHRA PRADESH

M.V.O.P No. 14 / 2019

Between :

Badam Pitchamma &Others ...Petitioners

and

Shaik Johny Basha & Others ...Respondents

To,

R-1:Shaik Johny Basha, S/o. John Saheb, R/o. Near Januma School, 8th ward, Piduguralla, Guntur(Dt.),A.P.

(Driver of TATA Sumo Car No. AP 16U 8005)

... ది. 02-08-2024 ... 10-30 ...

మండపాటి శ్రీనివాస రెడ్డి ... గురజాల, పల్నాడు జిల్లా, సెల్: 98660 49060

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం శిక్షార్హం

అచ్చంపేట: హెల్మెట్ లేకుండా మోటారు వాహనాలు నడపడం ప్రమాదమే కాకుండా శిక్షార్హమని సీనియర్ ప్యానల్ అడ్వకేట్ దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేల్పూరులో సోమవారం హెల్మెట్ ప్రాధాన్యతపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి మోటారు వాహనదారుడు హెల్మెట్ పెట్టుకోవడం అలవాటుగా భావించాలన్నారు. హెల్మెట్ పెట్టుకోవడం వల్ల మనల్ని మనం రక్షించుకోవడమే కాక మనపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు రక్షణగా ఉండవచ్చన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం హెల్మెట్ లేని ప్రయాణం శిక్షార్హమని పేర్కొన్నారు. లక్షల రూపాయల వ్యయంతో బైకులు కొనుక్కునే వారు కేవలం రూ.వెయ్యికు వచ్చే హెల్మెట్ పట్ల అశ్రద్ధ చూపుతారని, దానివల్ల ఏ స్థాయిలో నష్టం కలుగుతుందో తెలుసుకోలేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రమాదంలో ఏ అవయవానికి దెబ్బ తగిలినా బ్రతకొచ్చుగానీ, తలకు దెబ్బ తగిలితే కోలుకోవడం కష్టమన్నారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ కోట బాబురావు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)

Office mail : sakshigntadvt@gmail.com